క్లుప్తంగా

గ్రంథాలయంతో విద్యార్థులకు విజ్ఞానం



విద్యార్థులకు బోధిస్తున్న లైబ్రేరియన్ ధమయంతి

నర్సీపట్నం: గ్రంథాలయానికి నిత్యం రావటం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరుతుందని లైబ్రేరియన్ దమయంతి విద్యార్థులకు సూచించారు. ఆదివారం స్థానిక శాఖా గ్రంథాలయంలో చిల్డ్రన్ క్లబ్ నిర్వహించారు. ఇందులో భాగంగా చదవడం మాకు ఇష్టం కార్యక్రమంపై అవగాహన కల్పించారు. మాస్ రీడింగ్ నిర్వహించి, కథల పుస్తకాలు ఒక్కొక్క విద్యార్థితో చదివించారు. ఈ సందర్భంగా లైబ్రేరియన్ మాట్లాడుతూ క్రమం తప్పకుండా విద్యార్థులకు చిల్డ్రన్ క్లబ్‌కు విచ్చేసి సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పీఎంసీ చైర్‌పర్సన్ మృతికి సంతాపం

రోలుగుంట: కొండపాలెం గ్రామానికి చెందిన వైదాసు లక్ష్మి(38) మృతికి పలువురు సంతాపం తెలియజేశారు. ఆదివారం ఆమె తన స్వగృహంలోనే ఆకస్మికంగా మృతి చెందారు. రోలుగుంట జెడ్పీ ఉన్నత పాఠశాల పీఎంసీ చైర్‌పర్సన్ పనిచేస్తున్న ఆమె మరణ వార్త తెలుసుకున్న హెచ్‌ఎం వరప్రసాద్‌రావు, ఉపాధ్యాయులు సతీష్, శ్రీరామ్మూర్తి, కిరణ్, నాని మృతురాలి కుటుంబీకులను పరామర్శించారు. లక్ష్మి భర్త నారాయణరావును ఓదార్చారు. మాజీ సర్పంచ్ బంటు సూర్యసన్యాశిదేముళ్లు, కొండపాలెం పీఎంసీ చైర్మన్ బంటు పరదేశి నివాళులర్పించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



ఆయుష్మాన్ భారత్‌పై వివరిస్తున్న వైద్యాధికారి చరణ్

మాకవరపాలెం: కేంద్ర పథకాలు, రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి సూచించారు. ఆదివారం తూటిపాలలో వికసిత్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య, వైద్యం, వ్యవసాయ, ఉపాధి పథకాలతోపాటు ఇతర శాఖల పరిధిలో కేంద్ర పథకాలు, రాయితీలను అధికారులు ప్రజలకు వివరించారు. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంపై వైద్యాధికారి చరణ్ తెలియజేసి, హెల్త్ కార్డులు పంపిణీ చేశారు. సర్పంచ్ గవిరెడ్డి ప్రసాదరావు, కార్యదర్శి గంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కోళ్లఫారం లబ్ధిదారుల నిరసన



మోకాళ్లపై నిరసన వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

రావికమతం: కోళ్లఫారం భూములకు సాగు పట్టాలివ్వాలని ఎస్సీ లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు కొత్తకోటలో అంబేడ్కర్ విగ్రహం వద్ద మోకాళ్లపై నిరసన వ్యక్తం చేశారు. గ్రామంలో 20 మంది ఎస్సీ లబ్ధిదారుల ఆర్థికాభివృద్ధికిగాను 1986లో సాంఘిక సంక్షేమ శాఖ ఆరెకరాల భూమిలో కోళ్ల ఫారాల షెడ్లు నిర్మించి కోళ్లు సరఫరా చేసింది. తదనంతరం నష్టాలు రావడంతో వాటిని మూసివేశారు. ప్రస్తుతం అవి నిరుపయోగంగా ఉండటంతో పట్టాలిస్తే, అక్కడ ఉమ్మడి వ్యవ సాయం చేసుకుంటామని కొన్నాళ్లుగా అధికా రులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయిందని వా పోతున్నారు. 15 రోజుల్లోగా స్పందించకుంటే రిలే దీక్షలు చే స్తామని హెచ్చరించారు. అంబేడ్కర్ సంఘం గౌరవాధ్యక్షుడు మల్లేటి రాజు, చెక్కా నాగేశ్వరరావు, రాజారావు, బుంగా నల్లప్ప పాల్గొన్నారు.

బీజేపీ విజయోత్సవం

అనకాపల్లిటౌన్: బీజేపీని దేశ ప్రజలు ఆదరించడం సంతోషంగా ఉందని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గండి వెంకటరమణ అన్నారు. బీజేపీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించడం పట్ల స్థానిక నెహ్రూచౌక్‌లో ఆదివారం వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పాలనా పటిమే ఏ ఎన్నికల్లోనైనా పార్టీని విజయం దిశగా నడిపిస్తున్నాయన్నారు.



రూ.28 లక్షలతో పూడిక తీతతో వడివడిగా పారుతున్న నీరు

కల్యాణపులోవ రిజర్వాయర్ నేపథ్యం..

రిజర్వాయర్ నిర్మించిన గ్రామం : కల్యాణపులోవ	ప్రాజెక్టుపై ఆధారపడ్డ గ్రామాలు: 11
నిర్మించిన సంవత్సరం : 1965–66	అధికారికంగా సాగునీరు విస్తీర్ణం : 4,750 ఎకరాలు
ప్రధాన కాలువ : 1	అనధికారికంగా : మరో 1,500 ఎకరాలు

విప్ ధర్మశ్రీ చొరవతో పూడిక తీత

అక్విడెక్ట్‌లకు రూ.38 లక్షలతో మరమ్మతులు

కల్యాణపులోవ కాలువల్లో జలకళ



శివారు.. సమృద్ధిగా సాగునీరు

కల్యాణపులోవ రిజర్వాయర్ ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు తీరాయి. దశాబ్దాలుగా సాగునీటి కాలువలు పూడిపోవడంతో శివారు భూములకు సైతం సాగునీరందేది కాదు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ చొరవతో రూ.28 లక్షలతో కాలువలన్నీ పూడిక తీశారు. దీంతో ప్రస్తుతం నీరు విడుదల చేయగానే శివారు భూములకు 24 గంటల్లో చేరుతోంది.

రావికమతం: దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని కల్యాణపులోవ రిజర్వాయర్ కాలువలకు ప్రభుత్వ విప్ ధర్మశ్రీ చొరవతో పరిష్కారం లభించింది. దీంతో రిజర్వాయర్ నీరు వడివడిగా శివారు భూములకు చేరుతోంది. వీటితోపాటు ప్రధాన కాలువపై చీమలపాడు, ములకలాపల్లి వద్ద అక్విడెక్ట్‌లు సైతం బాగుపడ్డాయి. మే నెలలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ జెడ్.కొత్తపట్నం, గంపవానిపాలెం, కొత్తకోట, దొండపూడి తదితర గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామాల రైతులు రిజర్వాయర్ కాలువల సమస్యలపై ఏకరువు పెట్టారు. దానికి ఆయన స్పందించి ఇరిగేషన్ అధికారులతో రిజర్వాయర్ కాలువను దెబ్బతిన్న అక్విడెక్ట్‌లను పరిశీలించారు.

రూ.28 లక్షలతో కాలువలన్నీ పూడికతీత

రిజర్వాయర్ కాలువలన్నీ 13 కిలోమీటర్ల మేర సిమెంట్ లైనింగ్ చేపట్టారు. ఈ పనులు చేపట్టిన తర్వాత మరలా మెయింటెనెన్స్ చేయకపోవడంతో పదేళ్లుగా పూర్తిగా మట్టి, తుప్పలుతో పూడిపోయాయి. నీరు విడుదల చేసినా పూడిక వల్ల ఆయకట్టు భూములకు సకాలంలో చేరేది కాదు. మరిన్ని క్యూసెక్కులు విడుదల చేస్తే కాలువపై నుంచి పొంగిపొర్లి గట్లు దెబ్బతినేవి. గతేడాది నీటి ప్రవాహానికి ఏకంగా రెండు చోట్ల గండ్లు పడ్డాయి. నీరు వృథాగా గెడ్డలో కలిసిపోయేది. ఈ సమస్య పరిష్కారానికి ధర్మశ్రీ సంకల్పించి ఇరిగేషన్, ఉపాధి అధికారులతో సమీక్షించి 11 గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు రూ.28 లక్షలు ఆ కాలువ పూడిక తీతకు కేటాయించారు. ప్రధాన కాలువతోపాటు అన్ని పిల్ల కాలువలు పూడిక తొలగించారు. ప్రస్తుతం కాలువలన్నీ జలాలతో కళకళలాడుతున్నాయి.



సరిచేసిన తర్వాత ఆగిన లీకేజీ



రూ.10 లక్షలతో చేసిన అక్విడెక్ట్ మరమ్మతులను పరిశీలిస్తున్న ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ

రూ.10 లక్షలతో అక్విడెక్ట్‌లకు మరమ్మతులు

కల్యాణపులోవ ప్రధాన కాలువపై ములకలాపల్లి, చీమలపాడు వద్ద నిర్మించిన రెండు ప్రధాన అక్విడెక్ట్‌లు పదేళ్లుగా మరమ్మతులకు గురయ్యాయి. నీరు వృథాగా పోయేది. దీనిని ఎవ్వరూ పట్టించుకోకపోవడంతో గండి కొట్టేసింది. ఈ నేపథ్యంలో విప్ ధర్మశ్రీ ఆ సమస్యను అనకాపల్లి ఎంపీ భీశెట్టి సత్యవతి దృష్టికి తీసుకెళ్లి రూ.10 లక్షలు మంజూరు చేయించారు. ఆ నిధులతో మరమ్మతులు చేయించారు. గత నెల 30న చీమలపాడు వచ్చిన ఎంపీ, విప్ ఆ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

వర్షాల్లోనూ నీరు వచ్చేదికాదు



కాలువ పూడిక పోయి ఉండటంతో వర్షాకాలంలోనూ మా పొలాలకు నీరు వచ్చేది కాదు. అధికారులకు అప్పటి పాలకులకు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ధర్మశ్రీ కృషితో పూడికతీయడం వల్ల ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల్లోనూ సమృద్ధిగా నీరందింది. 17వ టైలండ్ కింద మా భూములకు, మత్స్యవానిపాలెం పొలాలకు పూర్తిగా నీరందింది. పంటలన్నీ బాగానే ఉన్నాయి.

– గర్రెడ్డి తాతబాబు, రైతు, దొండపూడి

సమృద్ధిగా నీరందుతోంది



చీమలపాడు, ములకలాపల్లి వద్ద ప్రధాన రెండు అక్విడెక్ట్‌లు 15 ఏళ్లు శిథిలమై కాలువలో నీరు వృథాగా పోయేది. గత పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. ఎంపీ భీశెట్టి సత్యవతి మంజూరు చేసిన రూ.10 లక్షలతో రెన్నెల్లలోనే పూర్తిగా మరమ్మతులు చేశారు. నీటి వృథాకు అడ్డుకట్ట పడింది. మా పొలాలకు సకాలంలో నీరందుతోంది.

– ఏకా రాజిబాబు, రైతు, జెడ్.కొత్తపట్నం

పోలింగ్ కేంద్రాల్లో కలెక్టర్ ఆకస్మిక తనిఖీలు



కె.కోటపాడులో తహసీల్దార్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి



పి.పి.అగ్రహారంలో దరఖాస్తులు పరిశీలిస్తున్న జిల్లా ప్రత్యేకాధికారి కిరణ్‌కుమారి

కె.కోటపాడు/దేవరాపల్లి/చీడికాడ: ఓటరు నమోదు ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి బూత్ లెవెల్ అధికారులను ఆదేశించారు. ఓటరు నమోదు స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా దేవరాపల్లి, కె.కోటపాడు ఉన్నత పాఠశాలల్లో పోలింగ్ కేంద్రాలతోపాటు చీడికాడ మండలం తురువోలు, మాడుగుల ఆర్‌సీఎంలో పోలింగ్ కేంద్రాలను ఆదివారం ఆయన ఆస్మికంగా తనిఖీ చేశారు. కొత్త ఓటర్ల నమోదు, తప్పొప్పుల సవరణ తదితర అంశాలపై ఆరా తీశారు. ప్రత్యేకాధికారులు వి. రవీంద్రనాథ్, ప్రత్యేకాధికారి మహేశ్వర్, తహసీల్దార్లు ఎం.లక్ష్మి, జె.రమేష్ బాబు, బి.వి.రాణి, పీవీరత్నం, ఎంపీడీవోలు జయప్రకాష్, సీహెచ్.సుబ్బలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ సురేష్, డీటీ రమేష్, సత్యనారాయణ, వీఆర్వోలు అనంత్, నాగేశ్వరరావు, నూకరాజు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ ఉన్నారు.

మాడుగుల: ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరం రెండో రోజు ఆదివారం నిర్వహించారు. మండలంలో 69 పోలింగ్ కేంద్రాల్లో కొత్తగా ఓటరు నమోదుకు 202 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ పీవీ రత్నం తెలిపారు. ఓట్ల తొలగింపునకు – 52, సవరణలకు 74 దరఖాస్తులు అందజేశారన్నారు.

మాకవరపాలెం: ఓటర్ల సవరణకు నిర్వహించిన ప్రత్యేక శిబిరాలను జిల్లా ప్రత్యేకాధికారి కిరణ్ కుమారి పరిశీలించారు. మండలంలోని 59 పోలింగ్ కేంద్రాల పరిధిలో ఆదివారం శిబిరాలు జరిగాయి. ఈ నేపథ్యంలో పి.పి.అగ్రహారం పోలింగ్ కేంద్రాన్ని ఆమె సందర్శించి, ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను తనిఖీ చేశారు. పారదర్శకంగా ఓటర్ల జాబితాలను తయారు చేసేందుకు బీఎల్‌వోలు కృషి చేయాలన్నారు. తహసీల్దార్ ప్రసాదరావు పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా సీఎం సహాయ నిధి

డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



రూ.5 లక్షల చెక్కు అందజేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఎంతో మంది నిరుపేదలకు సీఎం సహాయ నిధి ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా నిలుస్తున్నారని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అన్నారు. సబ్బవరం మండలం తవ్వవానిపాలెం గ్రామానికి చెందిన లక్కవరపు ప్రసాద్(49) డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనోపాధి పొందుతుండగా ప్రమాదంలో కాలు కోల్పోయాడు. ఈ మేరకు అతడు సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయడంతో రూ. 5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆదివారం తారువ క్యాంప్ కార్యాలయంలో బాధితుడు ప్రసాద్‌కు డిప్యూటీ సీఎం అందజేశారు. ఈ సందర్భంగా సీఎం జగన్, డిప్యూటీ సీఎంలకు ప్రసాద్, అతని కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

హిందూ ధర్మంపై విస్తృత ప్రచారం



మాట్లాడుతున్న పామాయిల్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టరు పైల పోతురాజు

నాతవరం: హిందూ ధర్మాన్ని కాపాడేందుకు భక్తుల అభీష్టం మేరకు గ్రామాల్లో దేవాలయాలను తిరుమల తిరుపతి దేవస్థానం నిర్మిస్తుందని రాష్ట్ర పామాయిల్ కార్పొరేషన్ డైరెక్టరు పైల పోతురాజు అన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాతవరంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా గ్రామ పురవీధుల్లో భజన భక్తులు ఊరేగింపుగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన దేశంలో పూర్వమంతా హిందూ ధర్మాన్ని పాటించేవారన్నారు. కాలానుగుణంగా అనేక మతాలు పుట్టుకొస్తున్నాయని, చివరకు హిందూ ధర్మమే నిలుస్తుందన్నారు. మన భారతదేశం పేరులో హిందువు పేరు ఉండటమే అందుకు తార్కాణమన్నారు. సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటువంటి దైవ సంకల్ప కార్యక్రమాలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఫౌండేషన్ సభ్యులు ప్రజా ప్రతినిధులను సత్కరించారు. సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా ప్రచారకులు అరవింద్‌రాజు, ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, మాజీ ఎంపీపీ పారుపల్లి లక్ష్మి, తాండవ ప్రాజెక్టు మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, ఏఎంసీ డైరెక్టరు ఇట్టంశెట్టి సీతారామమూర్తి, నాయకుడు పోలిరెడ్డి రాజు, సిద్ధి వినాయక ఆలయ కమిటీ చైర్మన్ యర్రా కాశీవిశ్వేశ్వరావు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయాలి

గ్రామ గ్రామాన చైతన్య సదస్సులు



రావికమతంలో మాట్లాడుతున్న ఎంపీపీ రాజు

రావికమతం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీల సంక్షేమానికి ఎనలేని కృషి చేస్తున్నారని, ఆ ఘనతను చాటి చెప్పేందుకుగానూ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆధ్వర్యంలోఈ వారంలో రోలుగుంట నుంచి ప్రారంభమయ్యే సామాజిక సాధికార బస్సు యాత్రతోపాటు, వడ్డాదిలో బహిరంగ సభను విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఆదివారం గ్రామ గ్రామాన చైతన్య సదస్సులు నిర్వహించారు. మంత్రులు, పార్టీ రాష్ట్ర స్థాయి నాయకులు హాజరయ్యే ఈ యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొనడమేగాక ఒక్కొక్కరు 50 మందిని తీసుకురావాలని కోరుతున్నారు. గ్రామ గ్రామాన చేపట్టిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభిస్తోంది. ఎంపీపీ పైల రాజు, పార్టీ మండల నాయకులు ముక్కా మహలక్ష్మినాయుడు, కంచిపాటి జగన్నాథరావు, గుమ్ముడు సత్యదేవ్, శీలం శంకరరావు, తలారి ఆదిమూర్తి, ఆశరి వాసుగోవిందరావు, బంటు సన్యాసినాయుడు, రుత్త బాపునాయుడు, దంట్ల వెంకటరమణ పాల్గొన్నారు.

శరవేగంగా వరహాపురం-పెదగోగాడ తారురోడ్డు పనులు



తారుపూతకు సిద్ధంగా రోడ్డు

చీడికాడ: మండలంలోని చీడికాడ, చోడవరం వెళ్లే ప్రధాన రహదారికి లింకురోడ్డుగా ఉన్న వరహాపురం నుంచి పెదగోగాడ వెళ్లే తారురోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 20 ఏళ్ల క్రితం ప్రస్తుత డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కాంట్రాక్టర్‌గా వ్యవహరించినప్పుడు మూడున్నర కిలోమీటర్ల మేర ఈ రోడ్డును బీటీరోడ్డుగా నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఎటువంటి మరమ్మతులు చేయకపోవడంతో మొత్తం శిథిలమైంది. ఈ రోడ్డును పునర్నిర్మించేందుకు ఆయన రూ 1.50 కోట్లు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు వేగంగా సాగుతున్నాయి. మరో 15 రోజుల్లో పూర్తి కానుందని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు తెలిపారు.

ఎం.అలమండ-మామిడిపల్లి రోడ్డుకు రూ. 2.80 కోట్ల మంజూరు

దేవరాపల్లి: ఎం. అలమండ నుంచి మామిడిపల్లి వెళ్లే మట్టి రోడ్డుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో మోక్షం లభించిందని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకురాలు పోతల లక్ష్మి, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్, సర్పంచ్ దాడి జగన్, ఎంపీటీసీ పోతల వెంకటరావు తెలిపారు. 4.5 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ. 2.80 కోట్లు మంజూరు చేశారన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారన్నారు. ఈ మేరకు ఆదివారం వారు రోడ్డును పరిశీలించారు. రెండు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలియజేశారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి బండారు ప్రసాదరావు, పాల సంఘం అధ్యక్షుడు పాలిపిరెడ్డి రమణ పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణులను ఆదుకునేందుకు సేవా ట్రస్టు

చోడవరం: బ్రాహ్మణుల సంక్షేమానికి ప్రభుత్వం చేస్తున్న కృషి హర్షనీయమని గాయిత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్టు సంక్షేమ సంఘం అధ్యక్షుడు పుట్రేవు శ్యామ్‌ప్రసాద్ అన్నారు. నియోజకవర్గ స్థాయి బ్రాహ్మణుల వనసమారాధన కార్యక్రమం చోడవరంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున కుటుంబ సభ్యులతో పాల్గొని ఆటపాటలతో అంతా సందడిగా గడిపారు. ఈ ఏడాది విద్య, ఇతర వృత్తుల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈ సందర్భంగా ట్రస్ట్ తరఫున సహకారం అందించారు. నిరుపేద బ్రాహ్మణ విద్యార్థులకు కొంత ఆర్థికసాయం అందజేశారు. అనేక మంది బ్రాహ్మణులు పేదరికంలోనే జీవనం సాగిస్తున్నారని, వారందరికీ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ సాయం చేస్తూ ఆదుకుంటుందని శ్యామ్ ప్రసాద్ అన్నారు. బ్రాహ్మణులకు నిధులు కేటాయించి వాటి ద్వారా పింఛన్లు ప్రభుత్వం అందిస్తుందన్నారు. పేద బ్రాహ్మణులను ఆదుకోవడానికి గాయిత్రీ బ్రాహ్మణ సేవా ట్రస్ట్ ముందుంటుందని ట్రస్ట్ కన్వీనర్ కందర్ప కృష్ణమూర్తి అన్నారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు మందా గౌరీశంకర్, కందర్ప రామేషం, కందర్ప మాధురీశంకర్, విజమూర్తి శంకర్, ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పొలాల్లో వరి పనలు ఉంచొద్దు

రావికమతం ఏవో రూప



రావికమతం పొలంలో వరి పనలు ఉంచేసిన రైతులను అప్రమత్తం చేస్తున్న ఏవో రూప

రావికమతం: మిచాంగ్ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో ఏవో రూప రైతులను అప్రమత్తం చేశారు. ఆదివారం ఆమె పిల్లవానిపాలెం, మట్టవానిపాలెం, తదితర గ్రామాల్లో వరి పొలాలను పరిశీలించారు. రావికమతం, మేడివాడ, చినపాచిలలో కోత కోసి ఇంకనూ పొలాల్లోనే ఆరబెట్టిన వరిపనలను గమనించారు. తక్షణమే పనలను ఎత్తివేసి కుప్ప పెట్టేయాలని, టార్పాలిన్లు సిద్ధం చేసుకోవాలని, అవసరమైతే నూర్చేయాలని ఆయా రైతులను అప్రమత్తం చేశారు. దగ్గరుండి కుప్పలు పెట్టించారు. రైతులు కె.రామునాయుడు, గొర్లె భూలోక తదితర రైతులు ఆమె సూచనలు పాటించారు. ఇప్పటికే తడిసిన పనలు ఎక్కడైనా ఉంటే ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలని సూచించారు.

అలరించిన లాఫింగ్ క్లబ్ వినోదం

అనకాపల్లిటౌన్: స్థానిక వైఎంవీఏ హాలులో లాఫింగ్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన పలు వినోద కార్యక్రమాలు నవ్వులు పండించాయి. క్లబ్ అధ్యక్షుడు దాడి వాసు, కార్యదర్శి బొడ్డేడ మురళీ అధ్యక్షతన జరిగిన ఓ మనిషి నిన్ను నువ్వు చూసుకో, పిల్లలు కాదు బాబోయ్ పిడుగులు కామెడీషోకు జి.వీరేంద్రనాథ్ దర్శకత్వం వహించగా ఆకుల మౌళివర్ధన్, ఆకుల రోషన్‌బాబులు తమ నటనతో హాస్యాన్ని పండించారు. నవ్వులే నవ్వులు కార్యక్రమంలో మిమిక్రీ కళాకారుడు శ్రీకృష్ణ తన ప్రతిభతో కడుపుబ్బా నవ్వించారు. పులఖండం విజయబాబు ఈల పాట, జోకులు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.